జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 8 | జూన్ | 2026 ◆ పేజీలు : 5


# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 7, (ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# కార్పొ 'రేట్' వల




4 లో..

● ఇల్లందు, ప్రజాజ్యోతి

- పది పరీక్షలు రాసిన విద్యార్థులు వేటలో కార్పొరేట్ కళాశాలలు!
- అప్పడే మొదలైన ఇంటర్ అడ్మిషన్లు!
- విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం!
- రంగంలోకి లెక్చరర్లు, పిఆర్వోలు
- పాఠశాలల నిర్వాహకులకు తాయిలాలిచ్చి డేటా సేకరణ..?

ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తు అందించేందుకు తపన పడుతుంటారు. ఎంత కష్టమైనా, ఖర్చయినా నాణ్యమైన విద్యను అందించాలని కోరుకుంటారు. దీంతో వారి ఆరాటాన్ని కార్పొరేట్ కళాశాలలు సొమ్ము చేసుకుంటున్నాయి. మా కళాశాలలలో చేర్పిస్తే మీ పిల్లల ఇలా... అలా... అవుతారని మభ్యపెడుతున్నారు. ఇప్పడే అడ్మిషన్ తీసుకుంటే ఇంత శాతం ఫీజు తగ్గుతుందని ప్యాకేజీల పేరిట కోర్సుకో రేటు కడుతూ ఇంటివద్దనే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఇష్టమైన కోర్సు కాకుండా వారు చెప్పిన కోర్సులోనే జాయిన్ చేసి వారి భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాక ముందే లెక్చరర్లు, పిఆర్వో లు ఊర్లలో వాలిపోతున్నారు.

# ఎన్.సీ.ఎస్.టీకి ఇచ్చిన ఫిర్యాదే కారణమా..?



- కమిషన్ విచారణకు ముందు కోర్టు స్టే భూమిలో హడావుడి..!
- బాధిత కుటుంబంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమా..?
- సంఘ విద్రోహ చర్యలకు ఉసిగొల్పింది ఎవరు..?
- సాటివారిగూడెంలో కలకలం.. పోలీసు విచారణకు ముందే కొత్త పరిణామాలు

**కొత్తగూడెం, జూన్ 7 (ప్రజాజ్యోతి)** లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామంలో కోర్టు స్టే, పోలీసు కేసులో ఉన్న భూమి వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఎన్‌సీఎస్‌టీ (జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్)కు ఫిర్యాదు చేసిన అనంతరం తమపై ఒత్తిడి పెరిగిందని బాధితురాలు వజ్జ పాపమ్మ కుటుంబం ఆరోపిస్తోంది. కమిషన్ విచారణకు ముందు చోటు చేసుకున్న తాజా పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని బాధితులు పేర్కొంటున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్‌నగర్

మిగతా 2 లో...

# ప్రెషర్ కుక్కర్ ఐఈడీలు నిర్వీర్యం

- భారీ పేలుడు సామగ్రి స్వాధీనం




**చర్ల, జూన్ 07: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా బరసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోడ్మా గ్రామ సమీప దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో భారీ విజయాన్ని

మిగతా 2 లో...



# తొలకరి చూసి తొందరపడొద్దు

2 లో..

- మృగశిర చినుకుల కోసం రైతు ఎదురుచూపులు
- ఎల్నినో ప్రభావంతో ఖరీఫ్ సాగుపై ఆందోళన
- తొలి వానకే విత్తనం వేస్తే పెట్టుబడులు ప్రమాదంలో పడే అవకాశం
- ఆగస్టు, సెప్టెంబరులో వర్షాభావ పరిస్థితుల హెచ్చరిక
- భద్రాద్రి రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు

మృగశిర కార్తి ప్రారంభమైంది. ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడా జల్లులు కూడా కురుస్తున్నాయి. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతు మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో పొలంలోకి దిగేందుకు సాహసం చేయడం లేదు. ఎండలతో పగుళ్లు తీసిన నేల తడిసి ముద్దవాలని, దుక్కులు మొదలవాలని, ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్న వేళ ఈసారి ఎల్నినో ప్రభావం వర్షాలపై అనిశ్చితి నీడలు కమ్మేస్తోంది. వర్షాధార వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడిన భద్రాద్రి జిల్లా రైతులు సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం...

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ప్రెషర్ కుక్కర్ ఐఈడీలు నిర్వీర్యం



(మొదటి పేజీ తరువాయి...)

సాధించాయి. నక్సలైట్లు దాచిపెట్టిన రెండు ప్రెషర్ కుక్కర్ ఐఈడీలు, ఒక పైప్ బాంబును గుర్తించి సంఘటనా స్థలంలోనే సురక్షితంగా నిర్వీర్యం చేశాయి. అదేవిధంగా భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, నిషేధిత సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. దంతేవాడ జిల్లాలో నక్సలిజం నిర్మూలనలో భాగంగా జిల్లా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు నిరంతరం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో అందిన ఖచ్చితమైన నిఘా సమాచారంతో జూన్ 6న సీఆర్పీఎఫ్ 195వ బెటాలియన్, దంతేవాడ జిల్లా పోలీసులు సంయుక్తంగా తోడ్మా అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌ను ద్వితీయ కమాండ్ అధికారి విక్రాంత్ వర్మ పర్యవేక్షణలో, అసిస్టెంట్ కమాండెంట్ సంజీవ్ కుమార్ యాదవ్ నాయకత్వంలో నిర్వహించారు. సెర్చింగ్ సందర్భంగా ఉదయం 8.40 గంటల ప్రాంతంలో అనుమానాస్పద వస్తువులను గుర్తించిన జవాన్లు అప్రమత్తమై బాంబు నిర్వీర్య దళాన్ని (బీడీఎస్) సంఘటనా స్థలానికి రప్పించారు. పరిశీలనలో రెండు ప్రెషర్ కుక్కర్ ఐఈడీలు, 10 కిలోల బరువున్న ఒక పైప్ బాంబు ఉన్నట్లు తేలింది. అనంతరం బీడీఎస్ బృందం సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని సురక్షితంగా నిర్వీర్యం చేసింది. భద్రతా బలగాల అప్రమత్తతతో భారీ ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సందర్భంగా నక్సలైట్లు దాచిపెట్టిన పేలుడు పదార్థాల భారీ నిల్వను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇందులో బీజీఎల్, .303 రైఫిల్, ఎయిర్ రైఫిల్, మ్యాగజైన్‌లు, డెటోనేటర్లు, గన్ పౌడర్, కోర్డెక్స్ వైర్లు, వైర్‌లెస్ సెట్లు, 51 ఎంఎం బాంబు, నక్సలైట్ల యూనిఫాంలు, మందుగుండు సామగ్రి, ఎలక్ట్రిక్ కంట్రోల్ యూనిట్లు, బ్యాటరీలు, టెలిఫోన్ వైర్లు తదితర సామగ్రి ఉన్నాయి. అలాగే నక్సలైట్ల ప్రచార సాహిత్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ అనంతరం భద్రతా బలగాల సిబ్బంది అందరూ సురక్షితంగా తిరిగి చేరుకున్నారని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిపై పంచనామా నిర్వహించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన, అభిషేకం





**భద్రాచలం టౌన్ , జూన్ 7, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం సందర్భంగా రామయ్యకు ఆర్జిత సేవలో భాగంగా మూలవరులకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని చత్తీస్గడ్ రాష్ట్ర ఆయిల్ సీడ్ చైర్మన్ జితేంద్ర కుమార్ సాహూ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



# తొలకరి చూసి తొందరపడొద్దు

- మృగశిర చినుకుల కోసం రైతు ఎదురుచూపులు
- ఎల్నినో ప్రభావంతో ఖరీఫ్ సాగుపై ఆందోళన
- తొలి వానకే విత్తనం వేస్తే పెట్టుబడులు ప్రమాదంలో పడే అవకాశం
- ఆగస్టు, సెప్టెంబరులో వర్షాభావ పరిస్థితుల హెచ్చరిక
- భద్రాద్రి రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు

**మృగశిర కార్తె ప్రారంభమైంది. ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడా జల్లులు కూడా కురుస్తున్నాయి. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతు మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో పొలంలోకి దిగేందుకు సాహసం చేయడం లేదు. ఎండలతో పగుళ్లు తీసిన నేల తడిసి ముద్దవాలని, దుక్కులు మొదలవాలని, ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్న వేళ ఈసారి ఎల్నినో ప్రభావం వర్షాలపై అనిశ్చితి నీడలు కమ్మేస్తోంది. వర్షాధార వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడిన భద్రాద్రి జిల్లా రైతులు సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం...**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలు పెద్దఎత్తున సాగవుతుంటాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు వర్షాధార సాగుపైనే ఆధారపడుతున్నారు. ప్రతి ఏడాది మృగశిర కార్తె ప్రారంభం కాగానే పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు వేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతుంటారు. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఒకవైపు వర్షాల కోసం రైతాంగం ఆశగా ఎదురుచూస్తుండగా, మరోవైపు ఎల్నినో ప్రభావం కారణంగా వర్షపాతంపై నెలకొన్న అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. తొలి జల్లులు కురిసిన వెంటనే సాగు పనులు ప్రారంభించాలా, లేక మరికొంతకాలం వేచి చూడాలా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై నిపుణులు హెచ్చరిస్తుండటంతో రైతులు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ఎల్నినో ప్రభావం... రైతుకు పరీక్షాకాలం

పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితినే ఎల్నినోగా పిలుస్తారు. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వర్షపాత నమూనాలపై పడుతుంది. భారతదేశంలో ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపై దీని ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ విడుదల చేసిన అవగాహన పోస్టర్ ప్రకారం ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం, భూగర్భ జలాల మట్టం క్షీణించడం, ఖరీఫ్ పంటల ఉత్పాదకత తగ్గడం వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది.

### భద్రాద్రిపై పడనున్న ప్రభావం

భద్రాద్రి జిల్లాలో వర్షాధార సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో వర్షాల అనిశ్చితి ప్రత్యక్షంగా వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షాలు ఆలస్యంగా రావడం లేదా మధ్యలో దీర్ఘ విరామాలు ఏర్పడితే పంటల ఎదుగుదల, దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ఖరీఫ్ పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### తొలి వానలకే విత్తనం వేయడం ప్రమాదకరం

సాధారణంగా తొలి వర్షాలు కురిసిన వెంటనే రైతులు సాగు పనులు ప్రారంభిస్తుంటారు. అయితే ఈసారి అలాంటి తొందరపాటు నిర్ణయాలు నష్టాలకు దారితీయవచ్చని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో తొలి వర్షాల తర్వాత దీర్ఘకాల విరామం ఏర్పడే అవకాశాలు ఉంటాయని, దీంతో మొలకెత్తిన పంటలు తగినంత తేమ అందక ఎండిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అందువల్ల నేల కనీసం మూడు నుంచి ఐదు అంగుళాల లోతు వరకు పూర్తిగా తడిసిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని సూచిస్తున్నారు.

### తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే పంటలపై దృష్టి

ఈ విషయమై ప్రజా జ్యోతి ప్రతినిధితో మాట్లాడిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రైతులు సాగు విషయంలో ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో సాగు చేపట్టే రైతులు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలను ఎంపిక చేసుకోవడం మంచిదని తెలిపారు. 40 నుంచి 45 రోజుల వ్యవధిలో చేతికొచ్చే పంటలను ఎంచుకోవడం ద్వారా వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు.

### నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

వర్షాల కొరత ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో పొదుపు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. పొలాల్లో తేమ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవడం, వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేయడం, భూగర్భ జలాల వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా పరిమితం చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ సలహాల మేరకు సాగు నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ముందుచూపే రైతుకు రక్ష

వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని ఆకాశం వైపు చూస్తున్న రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సవాళ్లతో కూడుకున్నదిగా కనిపిస్తోంది. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని, శాస్త్రీయ సూచనలను పాటిస్తూ ముందస్తు ప్రణాళికతో సాగు చేపడితే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.



## ఆరుతడి పంటలే ఈసారి భరోసా



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**

వర్షాల అనిశ్చితి నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉన్న పంటల కంటే తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. ఈ విషయమై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ, "ఈ ఏడాది వర్షాల పరిస్థితిపై కొంత అనిశ్చితి నెలకొన్నందున రైతులు సంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను కూడా పరిశీలించాలి. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో విత్తే రైతులు 40 నుంచి 45 రోజుల వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. వర్షపాతం తగ్గినా రైతులకు పూర్తిస్థాయి నష్టం జరగకుండా ఉండేందుకు ఆరుతడి పంటలు కొంత భరోసా కల్పిస్తాయి" అని తెలిపారు. కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జలు, కొర్రలు, రాగులు వంటి పంటలు ప్రస్తుత పరిస్థితుల్లో అనుకూలంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ పంటలు తక్కువ వర్షపాతాన్ని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండటంతో పాటు నీటి అవసరం కూడా తక్కువగా ఉంటుందని వివరించారు. అంతేకాకుండా తొలి వానలు కురిశాయని వెంటనే విత్తనాలు వేయకుండా, నేలలో కనీసం మూడు నుంచి ఐదు అంగుళాల లోతు వరకు తేమ చేరిందో లేదో నిర్ధారించుకున్న తర్వాతే సాగు ప్రారంభించాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుంటే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని బాబురావు పేర్కొన్నారు.

# ఎన్.సీ.ఎస్.టీకి ఇచ్చిన ఫిర్యాదే కారణమా..?





(మొదటి పేజీ తరువాయి...)

గ్రామపంచాయతీకి చెందిన మల్లు జ్యోతి బస్, అతని తమ్ముడు సుభాష్ కారణంగా గత నాలుగు సంవత్సరాలుగా తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపించారు. వారి ముఖ్య అనుచరుల సహకారంతో తమపై వరుసగా తప్పుడు కేసులు నమోదు చేయించారని పోలీసు వ్యవస్థను ప్రభావితం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు.

### ››› 57 స్టాంప్ పేపర్ల మాయా జాలమా..?

మల్లు జ్యోతి బస్ అనే వ్యక్తి ఎస్టీ కోయ మహిళ వజ్జ పాపమ్మ పేరుతో 57కు పైగా స్టాంప్ పేపర్లు సేకరించి భూమిని ప్లాట్లుగా చూపిస్తూ విక్రయాలకు ప్రయత్నించారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై మల్లు జ్యోతి బస్‌ను ప్రశ్నించడంతో తమపై మరింత ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. ఆ స్టాంప్ పేపర్లను ఆధారంగా చేసుకుని కొంతమంది ఎస్టీ కుల స్థులతో భూమిపై హక్కులు ఉన్నట్లు ప్రచారం చేస్తూ వివాదాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. సాటివారి గూడెం గ్రామ పెద్దలు పడిగా వెంకటేశ్వర్లు, వజ్జ రామకృష్ణ సమక్షంలో వజ్జ పాపమ్మ పేరుతో ఉన్న స్టాంప్ పేపర్లు అదనంగా 16 ఖాళీ స్టాంప్ పేపర్లు తన వద్ద ఉన్నట్లు మల్లు జ్యోతి బస్ స్వయంగా అంగీకరించినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు సమాచారం అందించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ (కోయ) మహిళ అయిన వజ్జ పాపమ్మ పేరుతో ఉన్న స్టాంప్ పేపర్లు మల్లు జ్యోతి బస్ వద్ద ఉండటం వెనుక కారణాలేమిటని బాధిత కుటుంబం ప్రశ్నిస్తోంది. గిరిజన మహిళ పేరుతో ఉన్న 57 స్టాంప్ పేపర్ల వ్యవహారంలో ఇప్పటివరకు స్పష్టత తీసుకురావడంలో గత పోలీసు శాఖ అధికారుల విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మిగతా స్టాంప్ పేపర్లు సంఘ విద్రోహ చర్యలకు పాల్పడకుండా పోలీస్ శాఖ ముందోస్తూ చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### ››› ఒకే నెలలో మూడు కేసులు

భూమి కొనుగోలు చేశామని చెబుతున్న కొందరి పేర్లతో ఆస్తి ధ్వంసం జరిగిందంటూ వరుసగా కేసులు నమోదు కావడం అనుమానాలకు తావిస్తోందని బాధితులు పేర్కొన్నారు. సంఘటన స్థలంలో ఎటువంటి నిర్మాణాలు లేకపోయినా నిర్మాణాలు ధ్వంసం చేశారని కేసులు నమోదు కావడం ఆశ్చర్యకరమని ఆరోపించారు. 2023లో ఒకే ఆరోపణతో ఒకే భూమికి సంబంధించి వరుసగా మూడు కేసులు, మరో ఎస్టీ వ్యక్తి ద్వారా మరో కేసు నమోదు కావడం గమనార్హమని పేర్కొన్నారు. ప్లాట్ నెంబర్లు 5, 11, 4, 6 స్థలంలలో ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు లేకపోయినా నిర్మాణాలు ధ్వంసం చేశారంటూ ఫిర్యాదులు నమోదు కావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా తప్పుడు స్టేట్‌మెంట్ల ఆధారంగా అప్పటి పోలీస్ శాఖ అధికారులు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దీనివల్ల బాధిత కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురైందని తెలిపారు. న్యాయం కొరకు ఎన్.సి.ఎస్.టి జాతీయ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసినందుకు ఇదే క్రమంలో వజ్జ పాపమ్మ కుటుంబ సభ్యులు, వారికి సహకరిస్తున్న వ్యక్తులపై మరిన్ని కేసులు పెట్టేందుకు జ్యోతి బస్ అనుచరులు కొందరు సిద్ధమవుతున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు.

### ››› కమిషన్ విచారణకు ముందు హడావుడి ఎందుకు..?

తమ ఫిర్యాదుపై ఎన్‌సీఎస్‌టీ కమిషన్ స్పందించిందని జాతీయ కమిషన్ విచారణలో భాగంగా ఆదివారం కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయం, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ నుంచి తమకు సమాచారం అందిందని బాధిత కుటుంబం తెలిపింది. సోమవారం పోలీస్ స్టేషన్‌కు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలు సమర్పించాలని సూచించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగాల్సిన పోలీసు విచారణ, ఎన్సీఎసటీ కమిషన్ ఎంక్వయిరీకి ముందురోజే కోర్టు పరిధిలో, పోలీస్ కేసులో ఉన్న భూమిలో కొందరు వ్యక్తులు హడావుడి చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. విచారణను ప్రభావితం చేయడానికే ముందస్తు ప్రణాళికతో ఈ సంఘ విద్రోహ చర్యలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

### ››› ఎవరి ప్రేరణతో భూమిలోకి ప్రవేశించారు..?

బాధితుల కథనం ప్రకారం గుగులోత్ విష్ణు, సపావత్ పిచ్చయ్య, బ్రహ్మసాని సందీప్, హమాలీ కాలనీ సర్పంచ్ ప్రేమిందర్, సపావత్ దిలీప్ తదితరులు మరికొందరితో కలిసి కోర్టు స్టే, పోలీస్ కేసులో ఉన్న భూమిలోకి ప్రవేశించి హడావుడి చేశారని ఆరోపించారు. భూమిలోకి చొరబడిన వద్ద భూమి కొనుగోలు చేసినట్లు ఎటువంటి స్పష్టమైన ఆధారాలు లేకపోయినా వివాదాస్పద భూమిలోకి వెళ్లి ఉద్రిక్తత సృష్టించడం వెనుక ఎవరి ప్రేరణ ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విష్ణు అనే వ్యక్తి తన మొబైల్ ద్వారా వీడియో చిత్రీకరిస్తూ వజ్జ పాపమ్మ కుటుంబాన్ని అవమానపరిచే విధంగా గత విషయాలను వెల్లడిస్తూ వీడియోలు తీయడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని బాధితులు పేర్కొన్నారు. తెల్లవారితే ఎన్‌సీఎస్‌టీ కమిషన్ దరఖాస్తు ఆధారంగా కొత్తగూడెం డి ఎస్పీని కలిసేది ఉన్న సమయంలో కొత్త పరిమానాలు చోటు చేసుకోవడం అనేక అనుమానాలు తావిస్తుంది. భూమి పైకి వచ్చి దౌర్జన్యం చేసిన వారిపై పోలీస్ శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

### ››› ప్రధాన సూత్రధారి ఎవరు..?

ఎన్‌సీఎస్‌టీ కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లిన వెంటనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం యాదృచ్ఛికమా..? కమిషన్ విచారణకు ముందు ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నమా..? కోర్టు స్టే ఉన్న భూమిలోకి వెళ్లమని సూచించిన వ్యక్తి ఎవరు..? సంఘ విద్రోహ చర్యలకు ఉసిగొల్పింది ఎవరు..? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. దీని వెనక మల్లు జ్యోతి బస్ హస్తం ఉన్నదేమో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో వాస్తవాలు ఏమిటో పోలీసు దర్యాప్తు, జాతీయ కమిషన్ విచారణ, న్యాయస్థాన పరిశీలనలోనే తేలాల్సి ఉంది. ప్రస్తుతం సాటివారి గూడెం గ్రామంలో ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పటివరకు వజ్జ పాపమ్మ కుటుంబం పై నమోదు అయిన పోలీస్ కేసులు, స్టాంప్ పేపర్ల వ్యవహారం పై మరియు జ్యోతి బస్ ఆగడాలపై విచారణ జరిపే విధంగా హైకోర్టు ద్వారా ప్రత్యేక కమిటీ నియమించేందుకు కోర్టు వారిని కోరెందుకు బాధితులు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- **టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు**



**ఆళ్ళపల్లి. జూన్7(ప్రజాజ్యోతి)** టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయవలసిన సమయంలో హేతుబద్ధీకరణ పేరుతో పాఠశాలల విలీనం, మూసివేత చర్యలు చేపట్టడంఆందోళన కలిగించే విషయం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 27 వేల పాఠశాలలు అవసరంలేదని 4వేల పాఠశాలలు ఉంటే సరిపోతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలను పాతర వేసి, కార్పొరేట్ స్కూల్ వ్యవస్థకు వంత పాడినట్లుగా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేయడమే అవుతుంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, మౌలిక వసతులను.మెరుగుపరచడం. విద్యార్థుల నమోదు పెంచే చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత, కానీ పాఠశాలను మూసివేయడం సమస్యలకు పరిష్కారం కాదు. అందువల్ల హేతుబద్ధీకరణ పేరుతో చేపడుతున్న పాఠశాలల మూసివేత , విలీన విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని, ప్రభుత్వ విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఫ్) తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

## శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం టౌన్ , జూన్ 7, ప్రజాజ్యోతి** తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న శ్రీ చద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయంలో ప్రవేశాలకు భద్రాచలంలో సోమవారం స్థానిక అంబాసత్రంలో స్పాట్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అహోబిలం మఠం నిర్వాహకులు తెలిపారు. 2026-27 సంవత్సరంకు గాను ఇంజనీరింగు, బీఏ, మేనేజ్‌మెంటు, లా, సంస్కృతం, సైరెన్‌హెడ్ సైన్సెస్, ఇతర డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7708557707, 9701185609 లో సంప్రదించాలని కోరారు.

## రామాలయంలో మతపరమైన పోస్టులకు ధృవపత్రాల పరిశీలన

- **హైదరాబాద్‌లో పరీక్ష రాసేందుకు హాల్‌టికెట్ల అందజేత**



**భద్రాచలం టౌన్ , జూన్ 7 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి ధృవీకరణ పత్రాలను పరిశీలించి హాల్ టికెట్లు జారీ చేసే కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఆదివారం హాజరైన వారి దరఖాస్తుదారుల ధృవీకరణ పత్రాలను దేవస్థానం ఏఈవో భవానీరామకృష్ణ ఆధ్వర్యంలో పరిశీలన చేసారు. అనంతరం ఈ నెల 9న హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ పర్యవేక్షణలో జరిగే పరీక్షకు హాజరయ్యేందుకు హాల్ టికెట్లను జారీ చేశారు. అలాగే సోమవారం సైతం దరఖాస్తుదారుల ధృవీకరణ పత్రాలను పరిశీలించి హాల్ టికెట్లు జారీ చేయనున్నారు.

## నేడు భద్రాచలంలో కంచి యూనివర్సిటీ స్పాట్ కౌన్సెలింగ్

**భద్రాచలం కల్చరల్, జూన్ 7 (ప్రజా జ్యోతి ):** కాంచీపురంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026–27 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం భద్రాచలంలో సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక శ్రీ అహోబిల మఠంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ కౌన్సెలింగ్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీ కంచి కామకోటి పీఠం శంకరాచార్య స్వాములవారి ఆశీస్సులతో స్థాపించబడిన ఈ విశ్వ విద్యాలయంలో ఇంజినీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్ మెంట్, లా, అలైడ్ హెల్త్ సైన్సెస్, సంస్కృతం, బి.ఎడ్ తో పాటు పలు యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసు, డీన్ సైన్స్ ప్రొఫెసర్ కె. వెంకటరమణ, కంచి కామకోటి శంకరమఠం ప్రతినిధులు పాల్గొని కోర్సులు, ప్రవేశ విధానం, స్కాలర్ షిప్ లు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా మెరిట్ స్కాలర్ షిప్ లతో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు వసతి, శాకాహార భోజనం, జిమ్, ఆధునిక క్రీడా సదుపాయాలు, ప్లేస్ మెంట్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి హాజరు కాలేని వారు కంచి యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 96290 01144, 97011 85609 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్ లాంచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం టౌన్ , జూన్ 7 , ప్రజా జ్యోతి** కొత్తగూడెంలో సోమవారం జరిగే రాకేష్ రెడ్డి ఈ–క్లాసెస్ యాప్ ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజవకర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. నిరుద్యోగ యువతకు నాణ్యమైన, ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఈ యాప్‌ను జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ యాప్ ఒక గొప్ప అవకాశమని, పోటీ పరీక్షలకు సంబంధించిన నాణ్యమైన కోర్సులు, స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు.


## సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ





**చర్ల,జూన్ 07:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని సత్యనారాయణపురంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సీఆర్పీఎఫ్ 81వ బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్. కొత్తగూడెం గ్రామం వరకు సాగింది. ర్యాలీలో సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు, స్థానిక యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు.ర్యాలీ ప్రారంభానికి ముందు నిర్వహించిన కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అధికారులు ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. నేటి ఆధునిక జీవన శైలిలో వాహనాల వినియోగం పెరగడంతో శారీరక శ్రమ తగ్గిపోతోందని, దీని కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, అధిక బరువు వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు.అలాగే పెరుగుతున్న ఇంధన వినియోగం, వాయు కాలుష్యం, పర్యావరణ సమస్యలను తగ్గించడంలో సైకిల్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. సైకిల్ ఒక పర్యావరణ హిత వాహనం అని, దీనివల్ల ఎలాంటి కాలుష్యం ఉత్పత్తి కాకపోవడంతో పాటు ఇంధన వ్యయం కూడా ఉండదని చెప్పారు. ప్రజలు తమ రోజువారీ అవసరాలకు, సమీప ప్రాంతాలకు వెళ్లేందుకు సైకిల్‌ను ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు.ర్యాలీ సత్యనారాయణపురం నుంచి ఆర్. కొత్తగూడెం వరకు గ్రామీణ ప్రాంతాల మీదుగా సాగగా, మార్గమధ్యంలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, సైకిల్ వినియోగం అవసరంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు సీఆర్పీఎఫ్ 81వ బెటాలియన్ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు. ప్రజలకు ఆరోగ్యంపై పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ అధికారులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొ 'రేట్' వల




- ఇల్లందు, ప్రజాజ్యోతి

- పది పరీక్షలు రాసిన విద్యార్థులు వేటలో కార్పొరేట్ కళాశాలలు!
- అప్పుడే మొదలైన ఇంటర్ అడ్మిషన్లు!
- విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం!
- రంగంలోకి లెక్చరర్లు, పిఆర్వోలు
- పాఠశాలల నిర్వాహకులకు తాయిలాలిచ్చి డేటా సేకరణ..?

**ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకు ఉన్నత భవిష్యత్తు అందించేందుకు తపన పడుతుంటారు. ఎంత కష్టమైనా, ఖర్చయినా నాణ్యమైన విద్యను అందించాలని కోరుకుంటారు. దీంతో వారి ఆరాటాన్ని కార్పొరేట్ కళాశాలలు సొమ్ము చేసుకుంటున్నాయి. మా కళాశాలలలో చేర్పిస్తే మీ పిల్లల ఇలా... అలా... అవుతారని మభ్యపెడుతున్నారు. ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే ఇంత శాతం ఫీజు తగ్గుతుందని ప్యాకేజీల పేరిట కోర్సుకో రేటు కడుతూ ఇంటివద్దనే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఇష్టమైన కోర్సు కాకుండా వారు చె ప్పిన కోర్సులోనే జాయిన్ చేసి వారి భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాక ముందే లెక్చరర్లు, పిఆర్వో లు ఊర్లలో వాలిపోతున్నారు.**

### డబ్బులిచ్చి డేటా సేకరణ

కార్పొరేట్ కళాశాలలు ఏజెంట్లకు కమిషన్లు, వేతనాలు చెల్లిస్తుండడంతో వారు విద్యార్థులను చేర్పించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఎవరైనా తల్లిదండ్రులు ఫలితాలు రాకముందే ఎలా చేర్పించాలంటూ ప్రశ్నిస్తే మీ పిల్లలు బాగానే చదువుతారని మాకు సమాచారం ఉందని తప్పకుండా పాస్ అవుతారని చెప్పడం విశేషం. అవసరమైతే పాఠశాల యాజ మాన్యం, ఉపాధ్యాయుల నుండి తల్లిదండ్రులతో మాట్లాడించడం జరు గుతుంది. ఒకవేళ పాస్ కాకపోతే చె ల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామంటూ హామీలిస్తున్నారు. అంతేకాకుండా ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఆయా కళాశాలల్లో చేర్పిస్తే ఫీజులో నుంచి 10 నుండి 15 శాతం వరకు కమిషన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. పాఠశాలలలో విద్యనభ్యసించిన పది పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన డేటాను సైతం డబ్బులిచ్చి తీసుకోవడం జరుగుతుందని తెలుస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులకు పిఆర్వో, లెక్చరర్లు, కార్పొరేట్ కళాశాలల కార్యాలయం నుంచి ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం.

### అప్రమత్తతే ముఖ్యం

తల్లిదండ్రులు తొందరపడి కార్పొరేట్ కళాశాలల మాయమాటలు నమ్మి పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి కళాశాలలో చేరితే తరువాత ఎవరు పట్టించుకోరని పేర్కొంటున్నారు. ముందుగా విద్యార్థులు అభిప్రాయం, సదరు కళాశాలలో విద్య నాణ్యత, బోధన చేస్తున్న వారి అనుభవం అంశాలను కళాశాలలకు చెందిన సీనియర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్న తర్వాత ఆలోచించి అడ్మిషన్‌కు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

### కార్పొరేట్ కళాశాలల ఆగాడారాలను కట్టడి చేయాలి:

**చాందావత్ రమేష్ బాబు, టీఎన్ఎస్ఎఫ రాష్ట్ర నాయకులు**

కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాల అసత్య ప్రచారం, ఆగడాలను కట్టడి చేయాల్సిన బాధ్యత జిల్లా ఇంటర్ బోర్డు అధికారులదే. అక్రమ అడ్మిషన్ల దందాపై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించి పోరాటం చేస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులను అడ్మిషన్ల కోసం ఇబ్బందులకు గురి చేయవద్దు. అలా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

## సింగరేణి కాంటాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి

- టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు యాకుబ్ షావలి



**టేకులపల్లి,జూన్07,ప్రజాజ్యోతి:** సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న కేంద్రా,రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడేందుకు ముందుకు రావలనీ ప్రగతిల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసీఐ) రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి పిలుపునిచ్చారు. ఆదివారం టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని నిర్ణయంతో టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టియుసిఐ అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి పాల్గొని,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాలు 2017 లో జీతాలు పెరిగాయన్నారు, 9 సంవత్సరాలు కావస్తున్న కేంద్ర ప్రభుత్వం వేతన జీవోలు సవరణ చేయడంలేదని అన్నారు.ఈకార్మికుల జీతాలు పెంచకపోవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల శ్రమ దోపిడికి నిదర్శనం అన్నారు. సింగరేణి లాభాలలో రాష్ట్ర ప్రభుత్వం 51 శాతం కేంద్ర ప్రభుత్వం 49 శాతం వాటాలేసి పంచుకుంటు న్నారని వారఅన్నారు.ఈ లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికుల ఎడల ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతా ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం మొన్న పెంచిన జీతాలు అస్పష్టంగా ఉన్నాయని వారన్నారు.వెంటనే పున పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామపంచాయతీ కార్మికులకు కేంద్రం 8,500 ఇస్తుండగా రాష్ట్రప్రభుత్వం వేయి రూపాయలు కల్పిస్తుందన్నారు.సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల జీతాలలో రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శివయ్య,రామా రావు,ప్రసాద్,బాల సూర్య దేవా,బాలు,రాజేష్ ఎర్రమ్మ, నాగమణి,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల్లో ఆనంద వెలుగులు

- పర్సా వెంకట్ ఆధ్వర్యంలో వైభవంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కృషితో సాకారమవుతున్న పేదల సొంతింటి కలలు





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 7 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సా వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు పొందిన లబ్ధిదారులు తమ నూతన గృహాల్లో సంప్రదాయబద్ధంగా గృహప్రవేశాలు నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పర్సా వెంకట్ గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్సా వెంకట్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంగా మారిందని పేర్కొన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతర కృషి, ప్రత్యేక చొరవతో మండలంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాస సమస్యను పరిష్కరించి పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పీవీఆర్ యూత్ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు ప్రజలు పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో నిర్వహించిన ఈ సామూహిక గృహప్రవేశ వేడుకలు మండలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలను నింపుతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఇందిరమ్మ మహిళా శక్తి చీరెల పంపిణీ ప్రారంభం

- 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి చేతుల మీదుగా కార్యక్రమం



**పాల్వంచ, జూన్ 7, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని పాత పాల్వంచ 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణశ్రీ పేద ప్రాంత సమైక్యకు మంజూరైన 350 చీరెలు, విజయ దుర్గా పేద ప్రాంత సమైక్యకు మంజూరైన 480 చీరెలు, శ్రీ దుర్గా పేద ప్రాంత సమైక్యకు మంజూరైన 480 చీరెలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ చీరెల పంపిణీ చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, ఆర్‌పీలు నిమ్మల నాగమణి, యాటా అరుణ, ముత్యాల పుష్ప, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ యాకూబ్, ఎస్కే ఖాజా మియా, చిన్న పండు, బూసి శ్రీను, రమణాచారి, షేక్ అస్మత్ అలీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## కేఓసి నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్ కు స్వాగతం



**టేకులపల్లి,జూన్07,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా టేకులపల్లి మండలం కెఓసి నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన బింగి మాధవ్ ను ఆదివారం కే ఓ సి పనిచేస్తున్న సింగరేణి అనుబంధం సంఘం ఐఎన్టియుసి యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులు,నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. పలువురు ఉన్నత అధికారులు నూతన పిఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రెటరీ భూక్య నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్ మాధవ్ రావు ఆధ్వర్యంలో కోయగూడెం ఓసీ ని అభివృద్ధి పదంలో నడిపించాలని, కార్మిక సంక్షేమం, సంస్థ పురోగతి కి విశేష కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నామని ఆయన

## శ్రీశ్రీశ్రీ కోటెమ్మ అమ్మవారి 20వ వార్షికోత్సవంలో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు



**ములకలపల్లి జూన్ 07, (ప్రజాజ్యోతి)** మండలంలోని నర్సాపురం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ కోటెమ్మ అమ్మవారి 20వ వార్షికోత్సవ మహోత్సవాల్లో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే అన్నదాన కార్యక్రమం కోసం రూ.5,000 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల మోహన్‌రావు, సర్పంచ్ కుంజా వినోద్, తాండ్ర బుచ్చిబాబు, యినుగంటి రాము, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, మరీదు నాగు, బజ్జూరి చిన్నబ్బాయి, పామర్తి కృష్ణ, బొంతు నందు చౌదరి, బజ్జూరి నాగేశ్వరరావు, చెన్నారావు, పెన్నబోయిన వెంకటేశ్వర్లు, పామర్తి వెంకటేశ్వర్లు, బజ్జూరి కృష్ణ, బజ్జూరి ఈశ్వర్, మరీదు చెన్నారావు పాల్గొన్నారు.

## సమస్యలు నా దృష్టికి తీసుకురండి.. వెంటనే పరిష్కరిస్తా : కుంజా వినోద్

- నాగులమ్మ కొలుపులో పాల్గొన్న సర్పంచ్ వినోద్-శ్రావణి దంపతులు





**ములకలపల్లి, జూన్ 07 (ప్రజా జ్యోతి )** సమస్యలు ఉంటే ఉంటే దృష్టికి తీసుకురండి వెంటనే పరిష్కరిస్తా అని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాధపురం పంచాయతీ పరిధిలోని చింతపేట గ్రామంలో నాగులమ్మ కొలుపు వేడుకలకు జగన్నాధపురం సర్పంచ్ వినోద్–శ్రావణి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సోయం పద్మ, నాగేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వార్డు సభ్యులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా అందిస్తుందని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేదా ఇతర సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బైట వెంకటమ్మ, కూరం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మీడియం నారాయణ, సోయం బోడప్పతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- జూన్ 9 వరకు అవకాశం.. ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 7 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని కళాశాల వర్గాలు తెలిపాయి. జూన్ 9 వరకు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించినందున ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద, గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో గురుకుల కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాలలో బి.ఏ, బి.కాం, బి.ఎస్సి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, అధ్యయనానికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఈ గురుకుల కళాశాల ద్వారా పొందగలరని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ కళాశాల మంచి వేదికగా నిలుస్తోందన్నారు. జూన్ 9లోపు స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు అర్హులైన విద్యార్థులు కళాశాలను సంప్రదించాలని ఆర్‌సీఓ రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ బురాన్ కోరారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకుని ఉన్నత విద్యలో ముందడుగు వేయాలని వారు సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు: 9059490623, 9392540836, 8500006021, 9951734877, 9553131588.